క్లుప్తంగా

5 నుంచి కొత్తమ్మవారి వార్షికోత్సవాలు



మరిడిమాంబ అమ్మవారు

తగరపువలస: సంగివలస కొత్తమ్మ ఆలయ వార్షికోత్సవాలు మార్చి 5 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. తొలిరోజు మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం, రెండో రోజు ముత్యమాంబ, పోలమాంబ అమ్మవార్ల ఉత్సవాలు జరగనున్నాయి. మూడో రోజైన మంగళవారం అనుపు ఉత్సవాల సందర్భంగా నేలవేషాలు, బాణసంచా, పులివేషాలు, కోలాటం వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మూడు రోజులు ఆలయ ఆవరణలో పౌరాణిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మార్చి 15న దాతల సాయంతో ఆలయం వద్ద భారీ అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

మైక్రో వాసక్యూలర్‌పై వర్క్‌షాప్



డాక్టర్ సెంథిల్ మురుగన్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: గీతం దంత కళాశాల ఆస్పత్రి మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా సూక్ష్మ రక్తనాళాల చికిత్స విధానాలపై దంత వైద్యులకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. చెన్నైలోని సవిత దంత వైద్య కళాశాల రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ, అంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సెంథిల్ మురుగన్ ఆధ్వర్యంలో దంత వైద్యులకు సంబంధిత అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎన్‌వీవీ సత్యభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితోనే విజయాలు



సంగివలసలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ క్రీడాకారులతో ప్రసాదరెడ్డి

తగరపువలస: గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పోరాట స్ఫూర్తి అలవరచుకుంటే విజయాలు సాధించవచ్చని కబడ్డీ ప్రో తెలుగు టైటాన్స్ సీఈవో జీరు ప్రసాదరెడ్డి అన్నారు. సంగివలస పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అక్కరమాని లోవరాజు ఆధ్వర్యంలో క్రీడాకారులు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ప్రసాదరెడ్డి మాట్లాడారు. భీమిలి చుట్టుపక్కల గ్రామాల్లో క్రీడాకారులకు కొదవ లేదన్నారు. కాసేపు బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఇక్కడి క్రికెట్ క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

నిరాశ్రయురాలికి చేయూత

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలేనికి ఇటీవల కోల్‌కత్తా నుంచి వచ్చిన నిరాశ్రయురాలు ఇంటి ఎల్లమ్మకు ఆదివారం స్థానికులు బియ్యం, నిత్యావసర సరకులు ఇచ్చి అండగా నిలిచారు. ఆమెకు వాండ్రాసి సతీష్, రాజగిరి రవికుమార్, ధనాల రాజు తదితరులు సహకారం అందించారు.

తీరం.. మరింత సుందరం



సాగర్‌నగర్ బీచ్ వద్ద నిర్మిస్తున్న రోడ్డు



గుడ్లవానిపాలెం వద్ద ఫుట్‌పాత్‌కు వేస్తున్న రంగులు



మంగమారిపేట శిలా తోరణం చేరుకునేందుకు వేసిన రోడ్డు

బీచ్‌రోడ్డులో చురుగ్గా అభివృద్ధి పనులు

కొమ్మాది: సాగరతీరం మరింత సుందరంగా ముస్తాబవుతోంది. కొత్త కొత్త రోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లతో గుడ్లవానిపాలెం నుంచి భీమిలి బీచ్ రోడ్డు కొత్త శోభను సంతరించుకుంటోంది. జి – 20 సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో వుడా, జీవీఎంసీ సంయుక్తంగా అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నాయి. ఇందులో భాగంగా గుడ్లవానిపాలెం నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న డివైడర్లకు, ఫుట్‌పాత్‌లకు రంగులు వేస్తున్నారు. సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, మంగమారిపేట శిలాతోరణం, రామాద్రి బీచ్‌కు చేరుకునేందుకు ఇప్పటికే రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది.

తొట్లకొండ నుంచి భీమిలి జగ్గారావు తోట వరకు సెంట్రల్ లైటింగ్ పనులు వేగవంతంగా చేస్తున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం తొట్లకొండ రోడ్డు పాచ్ వర్క్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మరో నెల రోజుల్లో తీర ప్రాంతం మరింత సుందరంగా మారనుంది.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ముసలయ్యపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చిట్టివలసలో గ్రాడ్యుయేట్ ఓటర్లను ఓటు అడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొమ్మాది: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం ముమ్మరం చేశారు. ఉన్నత చదువులు చదివే యువతను ఎక్కువగా ప్రసన్నం చేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి జీవీఎంసీ 8వ వార్డు ముసలయ్యపాలెం, భువనేశ్వర్‌కాలనీలో ఆదివారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, పవన్, మాదు బుజ్జి, దువ్వి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో వార్డులో విస్తృత ప్రచారం

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరపున ఆ పార్టీ భీమిలి జోన్ ఒకటో వార్డు నాయకులు ఆదివారం ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన ప్రగతిని కరపత్రాల ద్వారా వివరించారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే గ్రామాల్లో కూడా అభివృద్ధి జరిగినట్టు వివరించారు. ప్రచారంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, పార్టీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ, నాయకులు జీరు సుజాత, కొప్పల రమేష్, కుంచా శివరామకృష్ణ, చింతగుంట శివ, పందిరి విజయ్, దుంప సాయిరెడ్డి, నీలాపు రామిరెడ్డి, యర్రా ప్రకాష్, జీరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఇల్లిపిల్లి అప్పలరాజు ఆదివారం తగరపువలసలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. ముఖ్యంగా భీమిలి టీడీపీ నాయకులను కలిసి తనకు మద్దతుగా ప్రచారం చేయాలని అభ్యర్థించారు.

పైప్‌లైన్ లీకై రోడ్డు మధ్యలో గొయ్యి



రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

ఆనందపురం : ఆనందపురం – గోస్తనీ వాటర్ వర్క్స్ మార్గంలో గొట్టిపల్లి గ్రామానికి సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. బోని గ్రామంలోని గోస్తనీ వాటర్ వర్క్స్ నుంచి విశాఖ నగరానికి తాగునీటిని తరలించడానికి చాలా కాలం క్రితం పైప్‌లైన్ వేశారు. రెండేళ్ల క్రితం ఆనందపురం – బోని రోడ్డుని పూర్తి స్థాయిలో విస్తరించారు. అయితే గొట్టిపల్లికి సమీపంలో పైప్‌లైన్ రోడ్డు మధ్యలో ఉండిపోయింది. దాన్ని మార్చడానికి వీలుపడకపోవడంతో అలాగే ఉంచేసి రోడ్డు నిర్మించారు. కాగా ఈ రోడ్డు పైనుంచి భారీ వాహనాలు ప్రయాణించే సమయంలో రోడ్డు కుంగి కిందన ఉన్న పైప్‌లైన్‌పై ఒత్తిడి పెరిగి దెబ్బతింటోంది. దీంతో లీకై నీరు ఎగజిమ్మడంతో రోడ్డు కోతకు గురై గోతులు ఏర్పడుతున్నాయి. దీని వల్ల వాహనాలు ఒక వైపు నుంచే ప్రయాణించాల్సి వస్తోందని వాహన చోదకులు అంటున్నారు. పైప్‌లైన్ లీకవుతున్న చోట రోడ్డు ప్రాంతాన్ని ఆనుకొని ఇటీవల ఓ పరిశ్రమ ఏర్పాటు చేశారు. ఆ పరిశ్రమకు రోజూ భారీ వాహనాలు వస్తుంటాయి. వాటి వల్ల కూడా రోడ్డు కుంగుతోందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

మంచు ముసుగు



విజయనగరం - శొంఠ్యాం రోడ్డులో లైట్లు వేసుకుని వెళ్తున్న బస్సు

పద్మనాభం: మండలంలో ఆదివారం ఉదయం 9 గంటల వరకూ మంచు దట్టంగా కురవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లు కనిపించకపోవడంతో బస్సులు, లారీలు, వ్యానుల డ్రైవర్లు 9 గంటల వరకు లైట్లు వేసుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. రబీలో సాగుచేస్తున్న చోడి, వరి పంటలపై మంచు కమ్మేసింది. దీని వల్ల పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మాన్సాస్ డైరెక్టర్ జీఎల్ఎన్ రాజు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ ద్వారా 2022 సెప్టెంబర్, అక్టోబర్‌లో నిర్వహించిన హిందీ పరీక్షలకు సంబంధించిన సర్టిఫికెట్లను భీమిలి హిందీ ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం పంపిణీ చేశారు. వీటిని మాన్సాస్ డైరెక్టర్ జి.ఎల్.ఎన్.రాజు చేతుల మీదుగా అందించారు. అనంతరం నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో సర్ సీవీ రామన్ జీవిత విశేషాలపై తెలుగు, హిందీ భాషల్లో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో విజేతలకు ఈ నెల 28న బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి నేరెళ్లవలసలో అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 23న జగన్నాథ ఎల్లారావు (57) అదృశ్యమయ్యారు. ఆ రోజు రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఆయన మరుసటి రోజు సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమారుడు జగన్నాథకుమార్ భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం ఎల్లారావు మృతదేహం నేరెళ్లవలస సమీపంలో స్థానికులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జోనల్ కార్యాలయంలో పుస్తకాలకు చెదలు

సిబ్బంది ఉన్నా ఎక్కడి పని అక్కడే



జెడ్సీ చాంబర్ ఎదురుగా పడేసిన విలువైన రికార్డులు



చెద పట్టిన విలువైన పుస్తకాలు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 కేంద్రం మధురవాడ జోనల్ కార్యాలయంలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ విలువైన స్టేషనరీ, రికార్డులు చెదలు కొరికేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ అవసరానికి మించి క్లాస్ – 4 సిబ్బంది, క్లర్క్‌లకు అసిస్టెంట్లు వంటి పోస్టుల పేరుతో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత కూడా సిబ్బంది కాలక్షేపం చేస్తున్నారు. ఇంత మంది ఉన్నా ఇక్కడ రికార్డులు, స్టేషనరీని పదిలంగా చూసుకోలేకపోతున్నారు. ఇందుకు ఇటీవల చెదలు పట్టిన స్టేషనరీ, విలువైన రికార్డులు, పుస్తకాలే నిదర్శనం. గతంలో ఒకటి, రెండు వార్డుల్లో పని ఒక ఆర్ఐ చేసేవారు. ఆ పనికి వెయ్యి మందికి ఒక్కరిని సచివాలయ వ్యవస్థ ద్వారా నియమించినా ప్రయోజనం లేకపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ సిబ్బంది సక్రమంగా ఫైల్స్ అప్‌లోడ్ చెయ్యడం లేదని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి కూడా ఇటీవల అక్షింతలు వేయాల్సి వచ్చింది. పలుకుబడి ఉన్న వ్యక్తుల సిఫార్సుతో కొందరు ఏళ్ల తరబడి జోనల్ కార్యాలయం నుంచి బదిలీ కావడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యంగా పని చేస్తున్నా పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి నిర్లక్ష్యంగా పనిచేస్తున్న సిబ్బందిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన అంతర జిల్లాల టెన్నిస్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న మెడోస్ స్పోర్ట్స్ విలేజ్ నిర్వాహకులు

తగరపువలస: చిట్టివలస మెడోస్ స్పోర్ట్స్ విలేజ్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన అంతర జిల్లాల అండర్ – 10, 12, 14 బాలుర, బాలికల విభాగ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతలకు నిర్వాహకులు ట్రోఫీలు అందించారు. అండర్ – 10 విభాగంలో విన్నర్‌గా రేవంత్‌రిషి, రన్నర్‌గా సత్యకృషి ట్రోఫీలు గెలుచుకున్నారు. అండర్ – 12 బాలికల విభాగంలో విన్నర్‌గా కె.హరిణి, రన్నర్‌గా కె.హన్విణి, బాలుర విభాగంలో విన్నర్‌గా డి.అఖిల్, రన్నర్‌గా కార్తీక్ నరసింహ, అండర్ – 14 బాలికల విభాగంలో విన్నర్‌గా ఇషిత, రన్నర్‌గా దినేష్ రాఘణి, బాలుర విభాగంలో విన్నర్‌గా సాయి మణికంఠ, రన్నర్‌గా డి.అఖిల్ ట్రోఫీలు గెలుచుకున్నారు. వీరికి నిర్వాహకులు డాక్టర్ చల్లారపు శ్రీనివాసరావు, డి.ప్రకాష్ బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. పోటీలకు రిఫరీగా నగేష్ వ్యవహరించారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- ఉత్సాహంగా ఆనంద మేళా



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహుతులకు స్వాగతం పలికారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు దీపిక లేడీస్ క్లబ్ సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు నృత్యం, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు.

ఎండాడ చెరువులో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలు తొలగిస్తున్న సంస్థ సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ చెరువులో సంత్ నిరంకారి మిషన్ ప్రాజెక్ట్ అమృత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఇక్కడి చెరువులో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, మిషన్ ట్రస్ట్ ప్రెసిడెంట్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి జాతర నేడు

తగరపువలస: సంగివలస ఎల్లమ్మ చదురు వద్ద సోమవారం అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. సాయంత్రం అమ్మవారిని గ్రామం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చదురు వద్ద అనుపోత్సవం నిర్వహించి పూజారి ఊళ్ల అప్పారావుచే అగ్నిగుండం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జరిగే జాతరలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ ప్రాంతంలో తీర్థం కూడా జరుగుతుంది.

చిరుధాన్యాలు ఆరోగ్యకరం



మాట్లాడుతున్న మిల్లెట్స్ క్యాంపైనర్ రాంబాబు

సీతంపేట: చిరుధాన్యాలు ఆరోగ్యకరమని మిల్లెట్స్ క్యాంపైనర్ రాంబాబు అన్నారు. గురుద్వారా సమీపంలోని ఒక హోటల్‌లో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని ఎలా తయారు చేయాలో అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలను నానబెట్టి వండుకోవాలని సూచించారు. వాటిని వండినపుడు వచ్చే గంజి తర్వాత రోజు తీసుకోవడం చాలా ఆరోగ్యకరమైనదని వివరించారు. అల్లం, వెల్లుల్లి, మజ్జిగ మంచి బాక్టీరియాను పెంచుతాయన్నారు. చిరుధాన్యాలను నానబెట్టి ఎండలో నేత వస్త్రంపై ఆరబెట్టి వాటిని పిండి చేసుకోవడం మంచిదన్నారు. బాగా పాలిష్ చేసిన ఆహార ధాన్యాలు ఆరోగ్యానికి మంచివి కాదన్నారు. సముద్ర ఉత్పత్తుల్లో ఎక్కువగా విషతుల్య రసాయనాలు ఉంటున్నాయని తెలిపారు. చద్దన్నం తినడం మంచి అలవాటని, రాగులతో చేసిన హల్వా వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. తెల్లవారిన ఎండ మంచిదని, గానుగ నూనె శరీరానికి రాసుకుని కాసేపు ఎండలో ఉండి స్నానం చేయడం ఆరోగ్యకరమని వివరించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు దాట్ల వర్మ, అశోక్, ఎం.యుగంధర్‌రెడ్డి, జె.వి.రత్నం, రుషి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీ సిద్ధేంద్రయోగి నాట్యాలయం చిన్నారుల నృత్య ప్రదర్శన

మధురవాడ : జానపద, ఆధ్యాత్మిక గీతాలకు చిన్నారులు చక్కని అభినయంతో చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. వారి హావభావాలు మరింత ముచ్చట గొలిపాయి. ఈ చక్కని నృత్యాలకు మధురవాడ శిల్పారామం జాతర వేదికై ంది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం శ్రీ సిద్ధేంద్రయోగి నాట్యాలయం చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు రాఘవ, పల్లవి, కీర్తి, ఈశ, వేదిత, స్రవంతి, కణిత, యశస్వని, మోక్ష, బాసిత తదితరులు చక్కగా నృత్యం చేసి పలువురి మన్ననలు పొందారు.


ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం



దీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి, నాయకులు

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా రక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరాహార దీక్షలు 675వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి లభించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు కూడా ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమవంతు పాత్రను పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం కూడా అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు శివాజీ, ఏపీ పరిరక్షణ జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి జగన్ మురారి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూ దేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చా రు. ఆలయ అర్చకుడు పవన్ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కల్యాణం జరిపించారు.